క్లుప్తంగా

చేతిరాత బాగుంటే మంచి మార్కులు



మాట్లాడుతున్న కాలిగ్రఫీ నిపుణురాలు గ్రేస్

మహానంది: విద్యార్థుల చేతిరాత బాగుంటే మంచి మార్కులు వస్తాయని, చేతిరాత చూస్తేనే అర్థమయ్యేలా ఉండాలని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కాలిగ్రఫీ నిపుణురాలు గ్రేస్ తెలిపారు. బండిఆత్మకూరు మండలం ఏ.కోడూరులో గురువారం అంబేడ్కర్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో చేతిరాత నైపుణ్యంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గ్రేస్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చేతిరాతపై దృష్టి సారించాలన్నారు. అంబేడ్కర్ విగ్రహ కమిటీ అధ్యక్షుడు, నిర్వాహకుడు కుమార్ మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమానికి మంచి స్పందన లభించిందని, ప్రతిభ చూపిన వారికి సర్టిఫికెట్లు అందిస్తామన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాఘవ ఆచార్యులు గురువారం తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ ఇంగ్లిష్ మీడియం, తెలుగు మీడియంలకు సంబంధించి అడ్మిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. ఒకేషనల్ గ్రూపుల్లో ఎంఅండ్‌ఏటీ, సెరికల్చర్ క్రాప్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్, సీపీఎస్ఎం, బ్యాంకింగ్, రిటైల్ మేనేజ్‌మెంట్, మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్, ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఫీమేల్) తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈనెల 31వ తేదీలోపు వరకు అడ్మిషన్లకు అవకాశం ఉందన్నారు. విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కూడా అందుబాటులో ఉందన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

మహానంది: ఉపాధి పనులకు వెళ్లిన వ్యక్తి గుండెపోటుతో మృతి చెందిన ఘటన గురువారం అబ్బీపురంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సంపంగి రవిశేఖర్ (45) ఉదయం ఉపాధి పనులకు హాజరయ్యాడు. పనులు చేస్తుండగా అస్వస్థతకు గురికావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం అందించినా కోలుకోలేక మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఏపీఓ మనోహర్, సిబ్బంది రవిశేఖర్ ఇంటి వద్దకు వెళ్లి మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గొర్రెలపైకి దూసుకెళ్లిన కారు

మహానంది: బండిఆత్మకూరు మండలంలో గురువారం కారు ఢీకొనడంతో రెండు గొర్రెలు మృతి చెందాయి. నంద్యాల నుంచి సంతజూటూరుకు వస్తున్న కారు స్థానిక సహకార బ్యాంకు వద్ద ప్రమాదవశాత్తు గొర్రెల మందపైకి దూసుకెళ్లింది.. అనంతరం చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో శేఖర్‌కు చెందిన రెండు గొర్రెలు మృతి చెందాయి. కారు ముందు భాగం నుజ్జునుజ్జవ్వగా ఎవరికి ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ప్రారంభానికి ముందే పగుళ్లు



ప్రారంభానికి ముందే పగుళ్లిచ్చిన హైవే కల్వర్టు

జూపాడుబంగ్లా: నేషనల్ హైవే 340సీ రోడ్డు నిర్మాణంలో భాగంగా మండ్లెం గిద్దాంజనేయస్వామి రైస్‌మిల్లు సమీపంలో నిర్మించిన కల్వర్టు ప్రారంభానికి ముందే పగుళ్లివ్వడంతో వాహనాల డ్రైవర్లు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూ.కోట్లు వెచ్చించి ఎన్‌హెచ్ 340సీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. అయితే పనుల్లో నాణ్యతా ప్రమాణాలను విస్మరించడం, పర్యవేక్షణాధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. పర్యవేక్షణాధికారులు చర్యలు తీసుకొని పనులను నాణ్యతగా చేపట్టేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

వర్మీ కంపోస్టు తయారీతో లాభాలు



వర్మీ కంపోస్టు తయారీని వివరిస్తున్న అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి

మహానంది: వర్మీ కంపోస్టు ఎరువుల తయారీతో రైతులకు అనేక లాభాలు ఉంటాయని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి తెలిపారు. వ్యవసాయ కళాశాలలో రైతులకు గురువారం వానపాములతో ఎరువుల తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రైతులకు శిక్షణతో పాటు తయారీకి కావాల్సిన వర్మీబెడ్స్, ట్రైనింగ్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే సాయంత్రం కళాశాలలో విద్యార్థులకు పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై శిక్షణ ఇచ్చారు.

ముంపు భూముల్లో మట్టి తవ్వకాలు

- యథేచ్ఛగా అక్రమ రవాణా
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- కమిషన్ ఏజెంట్లకు కాసుల పంట
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు





లక్ష్మాపురం రాయల్ చెరువు సమీపాన నల్లమట్టిని జేసీబీతో తవ్వి ట్రాక్టర్లలో నింపుతున్న దృశ్యం, నెహ్రూనగర్‌లో ట్రాక్టర్‌కు నల్లమట్టిని వేస్తున్న జేసీబీ

పగిడ్యాల: శ్రీశైలం నీటి ముంపు భూముల్లో పేరుకుపోయిన నల్లమట్టి కమిషన్ ఏజెంట్లకు కాసుల వర్షం కురిపిస్తోంది. ప్రభుత్వ అనుమతి లేకుండా యథేచ్ఛగా నల్లమట్టిని తరలిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. నిబంధనలకు తూట్లు పొడుస్తూ రోజుకు దాదాపు రూ.30 వేలకు పైగానే ఆర్జిస్తున్నారని అంచనా. అయినా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

యజమానులే ఏజెంట్లు..

జేసీబీ, ట్రాక్టర్ యజమానులే కమిషన్ ఏజెంట్ల అవతారమెత్తి ముంపు భూముల రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని నెహ్రూనగర్, లక్ష్మాపురం, ప్రాతకోట, బీరవోలు గ్రామాల పరిధిలో వారం రోజులుగా అక్రమ మట్టి తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. నీరు, భూమి, చెట్లు సంరక్షణ కోసం ప్రభుత్వం తీసుకొట్టిన వాల్టా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయకుండా రెవెన్యూ అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ట్రిప్పునకు రూ.1,200 నుంచి రూ.1,400

దూరాన్ని బట్టి ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పు రూ. 1200 నుంచి రూ. 1400 వరకు వసూలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం నల్లమట్టి కావాల్సిన వారు మైనింగ్ డిపార్ట్‌మెంట్‌కు క్యూబిక్ మీటర్ చొప్పున చలానా కట్టాల్సి ఉంటుంది. అయితే అలాంటివేవీ కట్టకపోవడంతో ప్రభుత్వానికి రావాల్సిన లక్షలాది రూపాయాల ఆదాయం అక్రమార్కుల జేబుల్లోకి చేరుతోంది. రెవెన్యూ, భూగర్భ గనుల శాఖ అధికారులు స్పందించి నల్లమట్టిని అక్రమంగా తరలిస్తున్న అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకుని వాహనాలను సీజ్ చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆదేశించాం

ముంపు భూముల్లోని నల్లమట్టిని తరలించే కమిషన్ ఏజెంట్లపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని వీఆర్వోలకు మౌఖికంగా ఆదేశించాం. నెహ్రూనగర్, లక్ష్మాపురం, ప్రాతకోట, బీరవోలు గ్రామాల్లో జరిగే మట్టి తరలింపుపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఇన్‌చార్జ్ ఆర్ఐ చంద్రమౌళిని ఆదేశించాం. నల్లమట్టిని రాయల్టీ కట్టకుండా అక్రమంగా తరలించడం చట్టరీత్యా నేరం. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన వారిపై చట్టరపంగా చర్యలు తీసుకుంటాం.

– నాగేశ్వరరావు, తహసీల్దార్, పగిడ్యాల

రికవరీ వాహనాల కొనుగోలు

శ్రీశైలం: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తుల వాహనాల రద్దీని క్రమబద్ధీకరించడానికి దేవస్థానం వారు రికవరీ వాహనం, టోయింగ్ వాహనం, ఎలక్ట్రికల్ హైడ్రాలిక్ లేడర్ వాహనాలను కొనుగోలు చేశారు. గురువారం వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీటిని ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు వినియోగించడం జరుగుతుందని ఈఓ పెద్దిరాజు తెలిపారు. అలాగే విద్యుత్ దీపాల మరమ్మతుల కోసం ఎలక్ట్రికల్ లేడర్ వాహనం వినియోగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, సహాయ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, రమణమ్మ, ఈఈ రామకృష్ణ ఉన్నారు.

అదనపు క్యూలు ఏర్పాటు చేయండి

పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అదనపు క్యూలు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఈఓ ఆదేశించారు. ఉచిత ప్రత్యేక దర్శన క్యూలను పరిశీలించిన అనంతరం ఉచిత దర్శన భక్తుల సౌకర్యార్థం అదనపు క్యూలైన్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు.



వాహనాలకు పూజలు చేస్తున్న ఈఓ

హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీఐ నాగభూషణ్

కొత్తపల్లి: గ్రామాలలో హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు రూరల్ సీఐ ఎం.నాగభూషణ్ హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో వివిధ పార్టీల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ జూన్ 6వ తేదీ వరకు అమలులో ఉంటుందన్నారు. ఎన్నికల ఫలితాల రోజున గ్రామాలలో ఎటువంటి అసాంఘిక కార్యకలపాలకు, హింసాత్మక ఘటనలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. గ్రామాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎక్కడాకూడా నలుగురికి మించి గుమికూడి ఉండరాదని సూచించారు. 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున అల్లర్లకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కౌంటింగ్ రోజున బాణాసంచా కాల్చడం వంటివి నిషేధమన్నారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ తిరుపతయ్యకు వినతి పత్రం ఇస్తున్న జెడ్పీటీసీ, మత్స్యకారులు

కొత్తపల్లి: మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి కోరారు. గురువారం స్థానిక తహసీల్దార్ తిరుపతయ్యకు మత్స్యకారులు జంబులయ్య, కాశీం, చిన్నమల్లయ్య, లింగేష్, కన్నయ్య, రంగన్న, బాలకృష్ణ తదితరులతో కలసి వినతి పత్రం అందించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ శ్రీశైలం వెనుకజలాలలో భాగమైన కృష్ణానది పరివాహక ప్రాంతాలలో సుమారు వెయ్యి కుటుంబాల మత్స్యకారులు చేపల వేట చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. లింగమయ్య గడ్డ, ఎద్దులకొండ, శివపురం గడ్డదుర్గ, పావురాల సరి, వజ్రాల గుంత, శివుని గడ్డ, జొన్నసెల గడ్డ, పచ్చగుంటి, తుమ్మతోక ప్రాంతాలలో మత్స్యశాఖ అనుమతులతో చేపలవేట చేస్తున్నారని చెప్పారు. అయితే కొద్దిరోజులుగా అటవీ శాఖ అధికారులు వారిని చేపలు పట్టనివ్వకుండా ఆంక్షలు విధించడం భావ్యం కాదన్నారు. చేపలు తరలించే మరబోట్లను నిలిపి వేసి మత్స్యకారుల జీవితాలతో చెలగాటం ఆడడం బాధకరమన్నారు. స్పందించిన తహసీల్దార్.. మత్స్యకారుల సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మత్స్యకారులు వెంకటేశ్వర్లు, తిరుపాలు, బాబు, రమణయ్య, శ్రీను, చిన్నలింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గొంతువాపు టీకా వేయించాలి

పగిడ్యాల: పశువుల్లో ప్రాణాంతక గొంతువాపు(గురక) వ్యాధిని అరికట్టేందుకు చేపట్టిన టీకా కార్యక్రమాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారిణి రాగసంధ్య కోరారు. గురువారం పాత, కొత్త ముచ్చుమర్రి గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి తెల్ల, నల్లజాతి పశువులకు టీకాలు వేశారు. అనంతరం వైద్యాధికారిణి మాట్లాడుతూ.. తాగునీరు, కలుషిత వాతావరణం, అనారోగ్య పశువుల స్పర్శ, కలుషితమైన గాలి, మేత, పరిసరాలు, ఈగలు, జోరీగల వంటి కీటకాల ద్వారా ఈ వ్యాధి వేగంగా వ్యాపిస్తుందని స్పష్టం చేశారు. వరదల అనంతరం నిలిచిపోయిన మురుగునీటిలో, అశుభ్రమైన పశువుల పాకలు ఈ వ్యాధి వ్యాప్తికి కారకాలని వివరించారు. ఈనెల 25వ తేదీ వరకు టీకా కార్యక్రమం ఉంటుందని పశువులు, మేకలు, గొర్రెలు, గేదేల పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ వీరేష్, వీహెచ్ఏ చరిత తదితరులు ఉన్నారు.



బొల్లవరంలో పశువుకు టీకా వేస్తున్న సిబ్బంది

పశువులకు టీకాలు వేయించాలి

నందికొట్కూరు రూరల్: గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పశుపోషకులు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని వెటర్నరీ అధికారి అశ్వర్థయ్య సూచించారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న కారణంగా పశువులకు గొంతు వాపు, చిటుకు వ్యాధులు సోకే ప్రమాదం ఉంటుందన్నారు. ప్రభుత్వం పశువులకు టీకాలు వేసేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు

టౌన్ సీఐని సస్పెండ్ చేయాలి



పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న ఏపీ రైతు మహిళా సంఘం నాయకురాలు, బాధితురాలు

నందికొట్కూరు: మహిళల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్న టౌన్ సీఐ ప్రకాష్‌కుమార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఏపీ మహిళా రైతు సంఘం జిల్లా నాయకురాలు షేక్ బీబీ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని పోలీసు స్టేషన్ ఎదుట కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. ఆమె మాట్లాడుతూ.. చాకలి మురళి అనే వ్యక్తి నానా బూతులు తిట్టడం, దురుసుగా ప్రవర్తించడంతో రజియాబీ అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్తే టౌన్ సీఐ బాధితురాలినే నోటికి వచ్చినట్లు దుర్భాషలాడడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. న్యాయం చేయాల్సిన పోలీసు అధికారే ఇష్టానుసారంగా మాట్లాడితే తమ బాధ ఎవరికి చెప్పుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. స్టేషన్ చుట్టూ తిరిగినా స్పందించకపోతే 100 కాల్ చేస్తే వార్నింగ్ ఇచ్చాడని, ఇంకా ఎందుకు 100 కాల్ సెంటర్ పెట్టారని ప్రశ్నించారు. స్పందించిన టౌన్ సీఐ ప్రకాష్‌కుమార్ తప్పెందని, ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఆందోళనలో ఏపీ రైతు సంఘం మహిళా నాయకురాలు నూర్జహాన్, తస్లీమ్, షబానా, లక్ష్మిదేవి, జయమ్మ, ఈశ్వరమ్మ, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎవరినీ దుర్భాషలాడలేదు

నేను ఎవరినీ దుర్భాషలాడలేదు, ఎవరినీ భయపట్టలేదు. స్టేషన్‌లో మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాం. విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. – ప్రకాష్‌కుమార్, టౌన్ సీఐ.

నేటి నుంచి పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో నేటి నుంచి జరగనున్న 10వ తరగతి, ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అధికారులు పరీక్ష కేంద్రాల్లో కట్టుదిట్ట వసతులు కల్పించారు. పరీక్షల హాల్ టికెట్లను డీజీఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్‌తో పాటు ఇంటర్ హాల్ టికెట్లను బీఐఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్లలో అందుబాటులో ఉంచారు.

పది పరీక్షలకు 27 పరీక్ష కేంద్రాలు..

24వ తేదీ నుంచి జూన్ 3 వరకు జరగనున్న 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు నంద్యాల జిల్లా వ్యాప్తంగా 7,748 మంది విద్యార్థులు హాజరు కానుండగా, 27 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరిగే పరీక్షల కు 27 మంది చొప్పున చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖాధికారులతో సహా 279 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.

పరీక్ష రోజు ఫీజు చెల్లించినా హాల్‌టికెట్లు..

పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు పరీక్ష రోజు ఫీజు చెల్లించినా హాల్‌టికెట్లు ఇస్తామని అధికారులు తెలిపారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఫీజు చెల్లించకపోయినా వెంటనే ఫీజు చెల్లించి హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షకు హాజరుకావచ్చు.

ఇంటర్‌కు 31 పరీక్ష కేంద్రాలు...

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 13,748 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. 31 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి ద్వితీయ సంవత్సర పరీక్షలు జరగనున్నాయి.

అందరికీ ఉపాధి పనులు కల్పించాలి

కొత్తపల్లి: మండలంలోని శివపురం గ్రామంలో అడిగిన ప్రతి ఉపాధి కూలీకి పనులు కల్పించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ స్వాములు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పి.సత్యరాజు, రైతు సంఘం నాయకులు జి దాసు డిమాండ్ చేశారు. గురువారం గ్రామ సచివాలయం ముందు ఉపాధి కూలీలతో కలసి ధర్నా నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి అజ్మత్‌కు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ గ్రామంలో కొంతమందికి మాత్రమే ఉపాధి పనులు కల్పిస్తున్నారన్నారు. ఎస్సీలు కొంత మంది, మైనార్టీలకు గత నెల రోజులుగా ఉపాధి పనులు కల్పించలేదని చెప్పారు. పనులు ఇవ్వమని అడిగితే పక్క గ్రామాల్లో బండరాళ్లపైన గుంతలు తీయాలని చేయలేని పనులను పెడుతూ ఉపాధి కూలీలను పనులకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు స్వామినాథం, నాగమ్మ, భరత్, లింగస్వామి, వెంకటమ్మ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

25న శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణం

జూపాడుబంగ్లా: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 25న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు మాకా వెంకటసుబ్బయ్య, మాకా సురేష్ గురువారం తెలిపారు. తడికమల్ల మాధురి, తడికమల్ల హరీష్ దంపతులు ఉభయ దారులుగా కలియుగనాథుడైన శ్రీవెంకటేశ్వరస్వామివారి కల్యాణం నిర్వహించనున్నారన్నారు. వేడుకల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

హేమారెడ్డి మల్లమ్మ ఆలయంలో పూజలు



ప్రత్యేక పూజల అనంతరం మల్లమ్మ ఆలయంలో భక్తులు

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని హేమారెడ్డి మల్లమ్మ గుడిలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జలాభిషేకం, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించాక హేమారెడ్డి మల్లమ్మకు పుష్పార్చన చేసి అలంకరించారు.

ఘనంగా అన్నమయ్య జయంతి



అన్నమయ్య చిత్రపటానికి పూజలు చేస్తున్న భక్తులు

మహానంది: కలియుగదైవం శ్రీ వేంకటేశ్వరస్వామికి జీవితాన్ని అంకితం చేసిన తాళ్లపాక అన్నమాచార్యుల ఆధ్యాత్మిక జీవితం ఎంతో గొప్పదని జానపద, భజనబృందం కళాకారుల సమన్వయ కమిటీ జిల్లా కార్యదర్శి రామచంద్రుడు తెలిపారు. గాజులపల్లెలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నమయ్య 616వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటసుబ్బమ్మ, వెంకటగిరి, మద్దిలేటి, టైలర్ మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

ప్యాకింగ్ చేసిన విత్తనాలనే విక్రయించాలి

నంద్యాల(అర్బన్): రైతులకు లూజు విత్తనాలు విక్రయించరాదని, ప్యాకింగ్ చేసిన వాటిని మాత్రమే విక్రయించాలని ఏడీఏ రాజశేఖర్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో గురువారం నంద్యాల మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు అధ్యక్షతన మండలంలోని రిటైల్ సీడ్స్ దుకాణ యజమానులకు విత్తన క్రయవిక్రయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్మరాదని, విత్తనాలు కొన్న ప్రతి రైతుకు రసీదు ఇవ్వాలని సూచించారు. నిబంధనలు పాటించని డీలర్లపై విత్తన చట్టం ప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

బీసీజీ వ్యాక్సినేషన్ పరిశీలన



బీసీజీ టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న అదనపు డీఎంహెచ్ఓ శారదాబాయి

పగిడ్యాల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో చేపట్టిన బీసీజీ టీకా కార్యక్రమాన్ని జిల్లా అదనపు డీఎంహెచ్ఓ శారదాబాయి గురువారం పరిశీలించారు. అనంతరం అదనపు డీఎంహెచ్ఓ మాట్లాడుతూ 60 ఏళ్లు పైబడిన వారు బీసీజీ టీకాను వేయించుకోవాలని కోరారు. గతంలో టీబీ బారినపడిన వారు, షుగర్ వ్యాధిగ్రస్తులు, పొగతాగే వారి కోసం ఈనెల 16 నుంచి ఆగస్టు 15వ తేదీ వరకు మూడు నెలలపాటు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రతి గురువారం అందుబాటులో ఉండే ఆరోగ్య ఉపకేంద్రాల్లో బీసీజీ టీకాను వేయించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మోహన్, అనిల్‌కుమార్, సీహెచ్ఓ రామగుర్రప్ప, హెల్త్ సూపర్‌వైజర్ శివగౌరీ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో అడల్ట్ బీసీజీ వాక్సినేషన్



రోగులకు అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూరు: బైర్లూటీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని సచివాలయాల్లో గురువారం అడల్ట్ బీసీజీ వాక్సినేషన్ కార్యక్రమం చేపట్టారు. క్షయ వ్యాధిని నిర్మూలించడానికి ఈ టీకాను వేస్తున్నట్లు బైర్లూటీ వైద్యాధికారి గోపాల్, పవన్‌కుమార్ తెలిపారు. ఐదు సంవత్సరాల క్రితం టీబీ వ్యాధికి గురైన వారు, టీబీ వ్యాధి గ్రస్తులతో కాంటాక్ట్ కలిగి ఉన్నవాళ్లు, 60 సంవత్సరాలు పైబడిన వారు, షుగర్ వ్యాధితో బాధపడుతున్న వారు, బీఎంఐ 18 కన్నా తక్కువ ఉన్నవాళ్లు, పొగ తాగుతున్న వారు ఈ వ్యాక్సినేషన్ వేయించుకోవాలని సూచించారు. ప్రతి గురువారం సచివాలయాల్లో బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ కుదుర్‌బాషా, సూపర్‌వైజర్ రవణమ్మ, మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ టీకాను తప్పనిసరిగా వేయించుకోండి

పాములపాడు: బీసీజీ టీకాను 60 ఏళ్లు పైబడి వయసున్న వారందరూ తప్పనిసరిగా వేయించుకోవాలని టీబీ సూపర్‌వైజర్ రవికుమార్ తెలిపారు. గురువారం మండలంలోని బానుముక్కల ఆరోగ్య ఉపకేంద్రం ఆవరణలో బీసీజీ టీకాపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. టీకా వేయించుకోవడం వల్ల క్షయవ్యాధి రాకుండా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్ఓ సృజన, ఏఎన్ఎం కృష్ణవేణి, 104 సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మహానందిలో వైభవంగా చండీహోమం





మహానందిలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం, ప్రిన్సిపల్ కమిషనర్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి

మహానంది: వైశాఖ మాసం, పౌర్ణమి పురస్కరించుకుని మహానందిలో గురువారం చండీహోమం వైభవంగా నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరరావు, హనుమంతుశర్మ స్థానిక యాగశాలలో చండీహోమం శాస్త్రోక్తంగా చేపట్టారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు చండీహోమంలో పాల్గొని, భక్తిశ్రద్ధలతో పూజలు చేసుకున్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..

తిరుపతి ఇన్‌కం ట్యాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ దుర్గేష్ సమ్రూత్ గురువారం మహానందికి వచ్చారు. మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఆయన శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం స్థానిక అలంకార మండపంలో వేదపండితుల ఆశీర్వచనం చేయించి జ్ఞాపిక అందించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీలకంఠరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఈశ్వరస్వామి రథోత్సవం



భక్తజన సందోహనం మధ్య రథోత్సవం

కొత్తపల్లి: గువ్వలకుంట్ల గ్రామంలో ఈశ్వరస్వామి తిరునాలలో భాగంగా గురువారం స్వామివారి రథోత్సవం వైభవంగా జరిగింది. గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ పురోహితులు లాల్‌బహదూర్ శాస్త్రి శివపార్వతుల ఉత్సవ మూర్తులకు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కుంకుమార్చన, పుష్పార్చన, తదితర పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన రథంలో వేయించింపజేసి శాస్త్రోక్తంగా రథాంగ పూజలు చేసి రథాన్ని ముందుకు లాగారు. మంగళవాయిద్యాలు, డప్పునాదాల నడుమ పురవీధుల వెంట రథోత్సవం కనుల పండువగా సాగింది.

హంద్రీ–నీవా కాలువలో పడి వ్యక్తి దుర్మరణం



మృతిచెందిన మధు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని వడ్డెమాను గ్రామం వద్ద హంద్రీ–నీవా కాలువలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. బ్రాహ్మణకొట్కూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దామగట్ల గ్రామానికి చెందిన కడ్డీల మధు (40) కొన్ని రోజులుగా మతిస్థిమితం లేక మద్యానికి బానిసై ఎటుపడితే అటు తిరిగే వాడు. గురువారం వడ్డెమాను గ్రామానికి వెళ్తూ హంద్రీనీవా కాలువలో నీరు తాగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారిపడి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగార్జున తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

దాడి కేసులో మరో ముగ్గురి అరెస్ట్

ఆళ్లగడ్డ : మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ప్రధాన అనుచరుడు నిఖిల్‌పై జరిగిన హత్యాయత్నం కేసులో మరో ముగ్గురు నిందితులను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో నిందితులు షేక్ మాలిక్ బాషా, షిండే చంద్రకుమార్, తప్పెట నరసింహ పట్టణంలోని మహాలక్ష్మీ ఫంక్షన్ హాలు ఎదురుగా ఉన్న టీ కొట్టులో ఉన్నారనే సమాచరంతో సీఐ రమేష్‌బాబు, ఎస్ఐ నగీన అదుపులోకి తీసుకుని విచారించి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారని చెప్పారు. కాగా కేసులో ప్రధాన సూత్రధారి ఏవీ సుబ్బారెడ్డి, మరో నిందితుడు చంటి కోసం కోసం విస్తృతంగా గాలిస్తున్నామని త్వరలోనే వారిని కూడా అరెస్ట్ చేస్తామన్నారు.